మర్రైతే నాయిన ఏ రంగు తూనీగలో ఉంటడో చెప్పమ్మా.. నేను దాన్ని పట్టుకుంట. ఎప్పటికి మనకాడనే పెట్టుకుందం''.

కొడుక్కు ఏం సమాధానం చెప్పాలో తెలియక ఆమె కొన్నిక్షణాలు మౌనంగా చూస్తుండి పోయింది. ముఖంలో విషాద ఛాయలు పరుచుకున్నయి. బాధించే జ్ఞాపకాలేవో ఆమె గుండెను తడిచేసినయి.

''మా నాయిన తప్పకుండ నీలంరంగు తూనీగనే అయ్యుంటడు. నాకు తెలుసు. అన్ని తూనీగల కంటే అవే మంచిగుంటయి. నేను ఎట్లనన్న నీలం రంగు తూనీగనే పట్టుకుంట!''..

తల్లి చేతుల్ని విడిపించుకొని పరుగెత్తబోయాడు బాలమల్లు. కానీ, ఆమె అతణ్ని వదిలిపెట్టలేదు. ఎన్నో రంగురంగుల తూనీగలు తలల మీది నుంచి ఎగురుతూ పోతుంటే.. వాడు నిరాశగా చూశాడు. వాటిలో కొన్ని నీలం రంగువి కూడా కనిపించినయి.

''అమ్మా! పైకి సూడు! మన పెద్దలు, పితరులు ఎంతమంది తిరుగుతున్నరో. వాళ్లలో మా నాయిన ఎవరో సరిగా చెప్పు'' ఆరాటంతో అడిగాడు.

ఇప్పుడు కూడా జవాబు చెప్పలేని నిస్సహాయతలో ఆమె వాడిమీద కావాలని కోపం తెచ్చుకున్నది.

''అడ్డదిడ్డంగ మాట్లాడకు. ఇంట్లకు పోదాం రా.. అన్నం తిందువు'' అని బలవంతంగా లాక్కుపోయింది.

* * *

తల్లి గడప ముంగిట్లో కూర్చొని ఉంది. ఆమేదో చెబుతుంటే.. బాలమల్లు వింటున్నాడు. వాడామెకు కొద్దిదూరంలో ఈతచాప మీద పడుకొని పలకమీద రాస్తూ.. మధ్యమధ్య ప్రశ్నలు వేస్తున్నాడు. కొడుకు పాత అంగి కున్న చిరుగుల్ని సూది దారంతో కుడుతున్నదామె.

బాలమల్లుకు తండ్రి గురించి తెలుసుకోవాలని మనసులో బలంగా ఉన్నది. కానీ, తల్లి ఏమీ చెప్పదని తెలుసు. ఇదివరకు కూడా ఎన్నోసార్లు అడిగాడు. ఎప్పుడూ చెప్పలేదు. మంకుపట్టి అడిగితే కోపగించుకుంటది. అయినా సరే, మళ్లీ ధైర్యం చేసి అడిగాడు..

''నాయిన ఎక్కడున్నడమ్మా? ఎప్పుడడిగినా సరిగ చెప్పనే చెప్పవు!''.

''గిప్పుడు నాయిన ముచ్చటెందుకురా నీకు? ఆమాట అడుగొద్దని ఎన్నిసార్లు జెప్పిన?'' విసుక్కున్నదామె.

బాలమల్లు మరోసారి నిరాశ చెందాడు. నాయిన ఎక్కడని అడిగితే తల్లి ఎందుకు చెప్పదో అర్థంకాదు. వాడిలో రోషం పొడుచుకొచ్చింది.

''నిజం చెప్పమ్మా..! అసలు నాయిన బతికి ఉన్నడా.. సచ్చిపోయిండా?'' అని మొండిగా అన్నాడు.

''ఏమో.. ఎవలకెరుక? యాడబోయి సచ్చిండో?'' ఆమె గద్దించి పెట్టింది.

''అట్లయితే సచ్చిపోయిన నాయిన తూనీగై తిరుగుతుండా..?''.

''బాలిగా.. నీకు దండం పెడుత. నాకు యాష్ట దెప్పియ్యకు. నోరు మూస్కోని పండుకో''.

గట్టిగా మందలించడంతో ఇక మాట్లాడకుండా వాడు చాపమీద పడుకున్నడు.

ఆమెకు బాధ కలిగింది. పాపం, వాడికేం తెలుసు.. పోరడు. తండ్రి యాదికొచ్చినప్పుడల్లా అడుగుతడు.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

కానీ, నిజం ఎట్ల చెప్పాలె? వాడి తండ్రి అమ్మను ఇడిసిపెట్టి పోయిండని చెబితే ఏమనుకుంటడు? అసలా ముచ్చట చిన్న పిల్లగానికి చెప్పొచ్చో చెప్పకూడదో కూడా ఆ స్థితిలో ఆమెకు అర్థంకాలేదు. మనసు అశాంతిగా, అలజడిగా ఉన్నది. తనమీద తనకే కోపంగా ఉన్నది.

బాలమల్లు తండ్రి ఇంటినుంచి వెళ్లిపోయి చాలా కాలమైంది. ఎక్కడికి పోయిండో, ఇప్పుడెక్కడున్నడో తెలియదు. ఆమె చాలారోజులు ఎదురుచూసింది. అతను రాకపోవడంతో ఆశలు చంపేసుకున్నది. పరిస్థితుల్ని ఎదుర్కొంటూ కొడుకుతో కలిసి జీవన పోరాటం చేస్తున్నది. బతుకుదెరువు కోసం నాలుగిళ్లలో పనిచేస్తుంది. ఇంకా బయటెక్కడైనా పని దొరికితే కూలికి కూడా పోతుంది. కొడుకు తప్ప ఆమెకు నా అనేవాళ్లెవరూ లేరు. కొడుకు.. తండ్రి ప్రస్తావన తెచ్చిన ప్రతిసారీ ఆమె మనసు కల్లోలమవుతుంది.

ఆవేదనతోనూ, చుట్టుముట్టే ఆలోచనలతోనూ ఉక్కిరిబిక్కిరవుతుంది.

'ఇప్పుడా మనిషి యాడున్నడో..?' తనలో తనే అనుకున్నది.

'ఎవలకెరుక? ఏ సుట్టాల మార్గమో.. ఏదన్న పనిమీదనో కాదుగదా పోయింది? అయినా ఆయనకేమైతది? మొగోడు.. మారాజులా యాడున్నా మస్తు సంతోషంగ ఉండి ఉంటడు' అనుకుంటూ.. కళ్లు తుడుచుకున్నది.

అప్పటికే కళ్ల నుంచి రెండు కన్నీటి చుక్కలు జారి పిల్లవాడి అంగి మీద పడ్డయి.

ఆమె కొడుకు అంగి కుట్టడం పూర్తిచేసి.. మునిపంటితో దారాన్ని కొరికి తెంపేసింది. సూది, దారం పక్కన పెట్టి అంగికి ఇంకెక్కడైనా చిరుగులున్నయేమోని పరిశీలించి చూసింది. చంక కింద ఒకచోట చిరిగినట్టు కనిపిస్తే.. అదికూడా కుట్టేసి మడతపెట్టి ఒడిలో పెట్టుకున్నది. మొగుడు తనను ఎందుకు కాదన్నాడో, తననూ.. చంటి పిల్లాణ్ని ఎందుకు వదిలేసిపోయిండో, అసలు తనలో ఉన్న లోపమేమిటో ఎంత వాపోయినా ఆమెకు అర్థం కాలేదు.

ఆ దినం అతను వెళ్లిపోతుంటే ఎంతనో బతిమాలింది. ఏడ్చింది. కాళ్లమీద పడ్డది. కానీ ఎంత చీదరించుకున్నడు? ఎంతగా విదిలించి కొట్టిండు? పసిబిడ్డ గురించి కూడా ఆలోచించకుండ.. ఇంట్లో తన వస్తువులన్నీ సర్దుకొని పోయిండు.

బయటెవరో స్త్రీతో సంబంధం పెట్టుకున్నడని, ఆమెతోనే లేచిపోయిండని ఊళ్లో అందరూ అనుకుంటుంటే విన్నది.

'నాలుగేండ్ల సంసారానికే నామీద మొఖం మొత్తింది. మొగోడు గద.. ఇంకోదాంతో లేచిపోయిండు!' నిస్సహాయంగా అనుకున్నది.

ఆమె భర్త కట్టెల కార్ఖానలో కార్పెంటరుగా పనిచేసేవాడు. కొద్దిరోజులు ఎదురుచూసిన తర్వాత అతను పనిచేసిన కార్ఖానకు వెళ్లి కనుక్కుంది. వారం రోజుల క్రితమే అతను పని మానేశాడని, తనకు రావాల్సిన జీతం బకాయిలు మొత్తం తీసుకొని పోయాడని అక్కడివాళ్లు చెప్పారు. చేసేదేమీ లేక వెనుదిరిగి వచ్చింది.

ఆలోచనల్లో మునిగిన ఆమె.. అట్లా కొడుకు పక్కన ఎంతసేపు కూర్చుండి పోయిందో తెలియదు. తేరుకొని బాలమల్లు వైపు చూస్తే.. వాడు పలక పక్కన పెట్టుకొని అట్లాగే నిద్రపోయాడు. ఆమె కొడుకును ఎత్తి పక్కమీద పడుకోబెట్టింది. అప్పటిదాకా పలకమీద వాడు గీసింది ఏమిటానీ చూసింది. అదో తూనీగ బొమ్మ. రెక్కలు చాపుకొని గాలిలో ఎగురుతున్నది. విచిత్రంగా దానికి మనిషి ముఖం ఉన్నది.

* * *

నిశ్శబ్దంగా ఇంట్లోకొచ్చి నిలబడ్డ అపరిచిత వ్యక్తివైపు కోపంగా చూశాడు బాలమల్లు. మొదట చూడగానే దొంగేమోననే అనుమానం వచ్చి.. వాడికి భయమేసింది. లోపలున్న తల్లిని పిలుద్దామని అనుకున్నాడు.

కొత్తవ్యక్తి ఏదో తప్పుచేసినోడిలా మాట్లాడక నిలుచు